క్లుప్తంగా

టెండర్లకు ఆహ్వానం

కడప రూరల్ : ప్రభుత్వ వైద్యశాలలకు సర్జికల్ కన్సుమబల్స్ సరఫరా చేయుటకు సీల్డ్ టెండర్లకు ఆహ్వానం పలుకుతున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ నాగరాజు తెలిపారు. పూర్తి వివరాలకు ఆసక్తి కలిగిన వారు ఈనెల 9వ తేదీలోపు జిల్లా అంధత్వ నివారణ అధికారి వద్ద ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటలలోపు డిమాండ్ డ్రాఫ్ట్ టెండర్ ఫారాలను పొందవచ్చునన్నారు. ఈ ఫారాలను పొందడానికి రూ.2 వేలు ఇన్‌ఫేవర్ ఆఫ్ జిల్లా ప్రోగ్రాం మేనేజర్ డీబీసీఎస్ కడప వారికి చెల్లించాలని తెలిపారు. పూర్తి వివరాలకు సెల్ నంబరు 9849376849 ను సంప్రదించాలన్నారు.

రేపు హౌస్ బిల్డింగ్ సొసైటీ సర్వసభ్య సమావేశం

కడప ఎడ్యుకేషన్ : కడప నగరం సీఎస్ఐ హైస్కూల్లో 6వ తేదీ బుధవారం ఉదయం 9.30 గంటలకు కడప జిల్లా ఎలిమెంటరీ, సెకండరీ టీచర్స్ హౌస్ బిల్డింగ్ సొసైటీ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విశ్వనాథరెడ్డి, బాలశౌరిరెడ్డిలు తెలిపారు. ఈ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకోనున్నట్లు తెలిపారు. ప్రతి సభ్యుడు తమకు రిజిస్టర్ అయిన ప్లాట్ డ్యాంకుమెంట్ జిరాక్స్ కాపీలో ప్రస్తుత హక్కుదారు పేరు, సెల్ నెంబర్ వేసి ఇవ్వాలన్నారు. సమావేశం విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వారు కోరారు.

మంచినీటిలో మురికినీరు వస్తోంది

కడప కోటిరెడ్డిసర్కిల్ : నగరంలోని 27వ డివిజన్ గౌస్‌నగర్‌లో మంచినీరులో మురికినీరు వస్తోందని సోషల్ జస్టిస్ ఫర్ ఇంటర్నేషనల్ సివిల్ అండ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ నగర అధ్యక్షుడు పటాన్ ఖాదర్‌బాషా సోమవారం మీడియాతో మాట్లాడారు. చాలా రోజుల నుంచి మంచి నీరు మురికినీరు లాగా వస్తున్న విషయాన్ని ఎన్నిసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు సమస్యను పరిష్కరించాలని ఆయన కోరారు.

ఆత్మీయ సత్కారం

కడప కల్చరల్ : యోగి వేమన విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యులుగా నియమితులైన ఆచార్య మూల మల్లికార్జునరెడ్డిని సోమవారం సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య తప్పెట రామప్రసాదరెడ్డి, సిబ్బంది కలసి ఘనంగా సత్కరించి మాట్లాడారు. సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులుగా పుస్తక సేకరణ, పుస్తక ప్రచురణ, లిఫ్టు ఏర్పాటు, అగ్నిమాపక యంత్ర ఏర్పాటు, రాయలసీమ అధ్యయన విభాగం ఏర్పాటు, గ్రంథాలయ వారోత్సవాల నిర్వహణ, రజతోత్సవాలను ఘనంగా నిర్వహించడం, వైఎస్సార్ లైఫ్ అచీవ్‌మెంట్ పురస్కారం పొందడం వంటి అనేక కార్యక్రమాలను నిర్వహించి పరిశోధనా కేంద్రాన్ని ఆచార్య మల్లికార్జునరెడ్డి అభివృద్ధి పథంలో నడిపించారన్నారు. కార్యక్రమంలో సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సహాయ పరిశోధకులు డాక్టర్ చింతకుంట శివారెడ్డి, డాక్టర్ భూతపురి గోపాలకృష్ణశాస్త్రి, గ్రంథపాలకులు జి.హరిభూషణ్‌రావులు పాల్గొన్నారు.

అనుగ్రహ పూర్ణురాలు ఆరోగ్యమాత

కడప కల్చరల్ : దేవుని అనుగ్రహం దీవెనలు ఆరోగ్య మాతపై సమృద్ధిగా ఉన్నాయని, అందుకే ఆమెను అనుగ్రహ పరిపూర్ణురాలుగా కొనియాడతారని జమ్మలమడుగు విచారణ గురువులు రెవ ఫాదర్ బడుగు సాంసన్ అన్నారు. కడప నగరం రైల్వేస్టేషన్ వద్దగల ఆరోగ్యమాత పుణ్యక్షేత్రంలో నవదిన ఉత్సవాలలో భాగంగా ఏడవ రోజు సోమవారం రెవ ఫాదర్ విజయబాబు దివ్యబలి పూజను సమర్పించగా, సాంసన్ దివ్య సందేశాన్ని అందించారు. అనంతరం గురువులను ఘనంగా సత్కరించారు. పుణ్యక్షేత్ర డైరెక్టర్ ఫాదర్ ఎండీ ప్రసాదరావు, సహాయ డైరెక్టర్ ఫాదర్ విల్సన్ తదితరులు పాల్గొన్నారు

ప్రభుత్వ సహకారంతోనే పర్యాటక అభివృద్ధి

కడప కల్చరల్ : జిల్లాలో ప్రభుత్వ సహకారంతోనే పర్యాటక రంగం అభివృద్ధి చెందగలదని పర్యాటకరంగ ప్రముఖులు సిద్దవటం సీతారామయ్య అన్నారు. సోమవారం పాత కలెక్టరేట్‌లోని ఇంటాక్ కార్యాలయంలో జరిగిన ప్రత్యేక సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 2007లో డాక్టర్ వైఎస్సార్ రాష్ట్రమంతటా పర్యాటక రంగానికి బలమైన పునాదులు వేశారని ప్రస్తుతం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం గండికోటలో ఓబెరాయ్ హోటల్ ఏర్పాటు చేస్తుండటంతో దానికి అంతర్జాతీయ ఖ్యాతి లభిస్తుందన్నారు. అనంతరం ఇంటాక్ కేంద్ర కార్యాలయం నూతన సభ్యులకు గుర్తింపు కార్డులను సీతారమయ్య ద్వారా పంపిణీ చేశారు. ఇంటాక్ కన్వీనర్ చిన్నపురెడ్డి, లైయన్స్ క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు పోతుల వెంకట్రామిరెడ్డి, ఇంటాక్ ప్రస్తుత కన్వీనర్ వీపీ సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపు మహా సుదర్శన హోమం

కడప కల్చరల్ : లోక కళ్యాణార్థం బుధవారం చెన్నై రోడ్డులోని శ్రీసర్వేశ్వర మహర్షి ఆశ్రమ ప్రాంగణంలోని శ్రీ రాజరాజేశ్వరి మందిరంలో మహా సుదర్శన హోమాన్ని నిర్వహిస్తు న్నట్లు హిందూ ధార్మికవేత్త కల్లూరు విజయా నందరెడ్డి తెలిపారు.

కృష్ణం వందే జగద్గురం

రేపు శ్రీ కృష్ణ జన్మాష్టమి

కడప కల్చరల్ : గడసరి తనం, ధీరోదాత్తత, రాజకీయ చతురత, ధర్మకర్తవ్య నిరతికి ప్రతి రూపం శ్రీ కృష్ణుడు. ఇంతటి విభిన్నమైన జీవన గమనం గల పాత్ర పురాణాలలో మరేది కనిపించదంటారు పెద్ద లు. అష్టమినాడు కష్టాల మధ్య పుట్టి చిన్న గ్రామంలో పెరిగి మహా యుద్ధం కురుక్షేత్రంలో ప్రధానపాత్ర వహించిన శ్రీకృష్ణుని జన్మదినం బుధవారం నిర్వహించనున్నారు. శ్రీకృష్ణ లీలలను వివరించే మహాభాగవతాన్ని పోతన మన జిల్లాలోని ఒంటిమిట్ట దివ్య క్షేత్రంలో రచించారు. ఆ కోవలోనే జిల్లాకు చెందిన మరి కొందరు కవులు శ్రీ కృష్ణ చరిత్రను భాగవతాన్ని తమదైన శైలిలో అందించారు. ప్రముఖ ఇంజనీరు పుత్తా పుల్లారెడ్డి భాగవత నామ సర్వస్వం పేరిట అందులోని 4124 పేర్లు, వాటి వివరాలతో 450 పేజీల పుస్తకాన్ని వెలువరించారు. పద్మశ్రీ పుట్టపర్తి నారాయణాచార్యులు భాగవత సుధాలహరి, జనమంచి శేషాద్రిశర్మ, శ్రీకృష్ణావతార తత్వం, వావిలకొలను సుబ్బారావు, శ్రీకృష్ణ లీలా తరంగిణి, మైనంపాటి సుబ్రమణ్యం, శ్రీకృష్ణ తాండవం రచించారు. జిల్లా కు చెందిన ఆధ్యాత్మికవేత్త అచ్చోలు పుల్లారెడ్డి భగవద్గీతను విశేషంగా ప్రచారం చేశారు. ప్రస్తుతం ఆయ న కుమారులు అచ్చోలు ముకుందారెడ్డి, ప్రసాద్ రెడ్డి సోదరులు కూడా భగవద్గీత ప్రచార కర్తగా విశేషంగా కృషి చేస్తున్నారు.

పెరిగిన గోశాలలు....

ఇటీవల శ్రీకృష్ణాష్టమిని గోకులాష్టమిగా వైభవంగా ని ర్వహిస్తున్నారు. ప్రసార మాధ్యమాల ద్వారా విస్తృత ప్రచారం జరగడంతో జిల్లాలో గోశాలల సంఖ్య ఇటీవ ల భాగ పెరిగింది. కేవలం కడప నగరం లోనే 4 గోశాలలు ఉన్నాయి. జిల్లా అంతటా దాదాపు 30 పైగా ఉండటం విశేషం.

ఉత్సాహ భరితంగా..

ఏటా కృష్ణాష్టమిని జిల్లాలో ఘనంగా నిర్వహిస్తారు. తెల్లవారు జామునుంచి చిన్నారి బాలలు కృష్ణుని వేష్యంలో సందడి చేస్తారు. యువకులు ఉట్టికొట్టి ఆనందిస్తారు. బుధవారం శ్రీకృష్ణాలయాలలో భక్తులు పెద్ద ఎత్తున హాజరవుతారు. రెండు రోజుల పాటు నిర్వహించనున్న ఈ ఉత్సవాల్లో భాగంగా బాలలు, యువత పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తారు. రాత్రి భారీగా ఊరేగింపు ఉంటుంది.


కడప ద్వారకానగర్‌లోని శ్రీ మురళీకృష్ణాలయం


ఆలయంలోని మూలమూర్తి

6,7 తేదీలలో కృష్ణాష్టమి వేడుకలు

కడప కల్చరల్ : స్థానిక ద్వారకానగరలోని శ్రీ మురళీకృష్ణ ఆలయంలో 6,7 తేదీలలో శ్రీకృష్ణాష్టమి వేడుకలను నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా 6న సుప్రభాతం, మూలమూర్తికి అభిషేకం, అగ్నిప్రతిష్ట, మూలమంత్ర, శ్రీసూక్త, సుదర్శన హోమం నిర్వహిస్తారు. సాయంత్రం 6 గంటల నుంచి స్థానిక విద్యార్థులు కృష్ణుడి లీలలను వర్ణిస్తూ సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నారు. గురువారం ఉదయం సుప్రభాత సేవ అనంతరం గీతామందిరంలో విశేష పూజలు నిర్వహిస్తారు. సాయంత్రం 5 గంటలకు ఊంజల సేవ, శ్రీకృష్ణ కీర్తనామృతం తదితర పూజలు ఉంటాయి. 5.30 ఆలయం ఎదుట ఉట్టి కొట్టే కార్యక్రమం చేపడతారు. సాయంత్రం 7 గంటల నుంచి ద్వారకా నగర్ వీధుల్లో ఊరేగింపు చేస్తారు.

క్లీన్ కడప సర్వీస్ స్టేషన్ ప్రారంభం

కడప కార్పొరేషన్ : కడప నగపాలక సంస్థ, హెచ్‌పీసీఎల్ సంయుక్త ఆధ్వర్యంలో పాత మున్సిపల్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన క్లీన్ కడప సర్వీస్ స్టేషన్‌ను ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా, మేయర్ సురేష్‌బాబు, కమిషనర్ ప్రవీణ్‌చంద్‌లు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపల్ కార్పొరేషన్ ఆదాయాన్ని పెంచుకోవడంతోపాటు ప్రజలకు నాణ్యమైన పెట్రోల్, డీజిల్ అందించేందుకు ఈ పెట్రోల్ బంక్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. నిర్వహణ పారదర్శకంగా ఉండేందుకు ఇక్కడ లావాదేవీలన్నీ నగదు రహితంగా, డిజిటల్ రూపంలోనే జరుగుతాయన్నారు. పెట్రోల్, డీజిల్ ఔట్‌లెట్ వల్ల నగరపాలక సంస్థకు బాడుగ, కమిషన్ రూపంలో ఆదాయం వస్తుందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ముంతాజ్ బేగం, హెచ్‌పీసీఎల్ చీఫ్ రీజనల్ మేనేజర్ నాగసతీష్, సీనియర్ మేనేజర్ కె.చంద్రశేఖర్, కార్పొరేటర్లు షఫీ, సుబ్బారెడ్డి, మల్లికార్జున, వైఎస్సార్‌సీపీ నాయకులు జయచంద్రారెడ్డి, కె.రాజశేఖర్‌రెడ్డి, ఐస్‌క్రీం రవి, డిష్ జిలానీ తదితరులు పాల్గొన్నారు.


క్లీన్ కడప సర్వీస్‌స్టేషన్‌ను ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, మేయర్ సురేష్ బాబు

'స్పందన' అర్జీలను సకాలంలో పరిష్కరించాలి

కడప కార్పొరేషన్ : 'స్పందన' కార్యక్రమానికి వచ్చే అర్జీలను సకాలంలో పరిష్కరించాలని మున్సిప ల్ కమిషనర్ ప్రవీణ్‌చంద్ ఆదేశించారు. సోమవా రం స్థానిక మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో 'స్పందన' కార్యక్రమంలో భాగంగా ఆయన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఇందులో మొత్తం 35 అర్జీలు రాగా, ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించి-10, టౌన్‌ప్లానింగ్-8, రెవెన్యూ-3, ఎస్టాబ్లిష్‌మెంట్-1, మెప్మా-2, సచివాలయాల విభాగం-1, కడప తహసీల్దార్-6, సీకే దిన్నె తహసీల్దార్-1, హౌసింగ్-2 అర్జీలు వచ్చాయి. వీటిని సమగ్రంగా పరిశీలించి తగిన సమయానికి పరిష్కరించాలని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ రమణారెడ్డి, డీసీపీ సూరజ్ కుమార్, ఏసీపీ నాగేంద్ర, ఎస్ఈ రత్నాలరాజు, డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.


అర్జీలు స్వీకరిస్తున్న మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్‌చంద్

గురులోకానికి ఆదర్శం 'డాక్టర్ సర్వేపల్లి'


పరుచూరు శంకరయ్యను సత్కరిస్తున్న దృశ్యం

కడప కల్చరల్ : డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ పండితుడు ఉపాధ్యాయ లోకానికి ఆదర్శమని, ఆయన అడుగుజాడల్లో నడచి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఈ వృత్తికి మరింత గౌరవం కల్పించాలని సర్వ శిక్ష అభియాన్ ప్రాజెక్టు అధికారి అంబవరం ప్రభాకర్ రెడ్డి తెలిపారు. సోమవారం ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘ కార్యాలయంలో అవార్డి టీచర్స్ అసోసియేషన్ మహా కవయిత్రి మొల్ల సాహితీ పీఠం సంయుక్త ఆధ్వర్యంలో గురుపూజోత్సవం ముందస్తు వేడుక సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి విద్వాన్ గానుగపెంట హనుమంతరావు అధ్యక్షత వహించారు. గురువులు నిరంతరం అధ్యయన శీలురుగా ఉంటూ విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలన్నారు. విద్యార్థుల మెప్పే ఉపాధ్యాయులకు నిజమైన అవార్డులన్నారు. విశ్రాంత ఉద్యోగుల సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.రామ్మూర్తి నాయుడు, సంఘ ప్రతినిధులు ఉండేల నాగముని రెడ్డి, కె.బాలఎల్లారెడ్డి, పి శంకరయ్య, కె.చెంచురెడ్డి, స్వర్ణలత, డాక్టర్ వెల్లాల వెంకటేశ్వరచారి, బాల సుబ్రహ్మణ్యం, నరేష్, దేవరాజు, పెండ్లిమర్రి మల్లయ్య, లక్ష్మయ్య మాట్లాడుతూ ఉపాధ్యాయులు పెట్టిన అక్షర బిక్షతో నేడు ఈ స్థాయిలో ఉన్నామన్నారు. పార్వతమ్మ రక్తదాన సేవాసమితి అధ్యక్షులు భోగా చెన్నయ్య మాట్లాడుతూ, ఉపాధ్యాయుల పాత్ర సమాజంలో వెలకట్టలేనిదన్నారు. అనంతరం ఉత్తమ ఉపాధ్యాయుడైన పరుచూరు శంకరయ్యను ఉపాధ్యాయ రత్న బిరుదుతో పాటు జ్ఞాపిక 2000 రూపాయల నగదు శాలువతో ఘనంగా సత్కరించారు. తదనంతరం ముఖ్యఅతిథి అంబవరం ప్రభాకర్ రెడ్డిని సన్మానించారు.

ప్రజలపై భారాలు వేస్తున్న ప్రభుత్వాలు

కడప కార్పొరేషన్ : ప్రజల నడ్డి విరిచేలా పన్నులు వేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను సాగనంపాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ అన్నారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఎదుట సీపీఎం నగర కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఉన్న నల్లధనాన్ని వెలికి తీసి ప్రజల ఖాతాల్లో రూ.15 లక్షల చొప్పున వేస్తానని చెప్పిన మోదీ రూపాయి కూడా ఇవ్వలేదన్నారు. గ్యాస్ సిలిండర్‌పై రూ.900 పెంచి, ఎన్నికల ముందు రూ.200 తగ్గించి మేలు చేసినట్లు ప్రచారం చేసుకుంటున్నారని ధ్వజమెత్తారు. పెట్రోల్, డీజిల్, నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయన్నారు. కరెంటు బిల్లులు, ఇంటి పన్నులు, సర్‌చార్జీలు, సేవా పన్నుల రూపంలో 120 శాతం పెంచారన్నారు. ముఖ్యమంత్రి జిల్లా వాసి అయినప్పటికీ కడప ఉక్కు ఫ్యాక్టరీని తేలేకపోయారన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఏ.రామ్మోహన్, చంద్రారెడ్డి, ఓబులేసు, ఫరూఖ్ హుస్సేన్, ఎమ్మార్ నాయక్, షాకీర్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.


మున్సిపల్ కార్పొరేషన్ ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

లింగాల ఎంపీపీగా అలవలపాటి రమాదేవి ఏకగ్రీవం

లింగాల : లింగాల ఎంపీపీగా వెలిదండ్ల ఎంపీటీసీ అలవలపాటి రమాదేవిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గతంలో లింగాల ఎంపీపీగా పనిచేసిన ఎం.అమృత అనివార్య కారణాల వల్ల పదవికి రాజీనామా చేశారు. దీంతో ఎంపీపీ పదవికి నోటిఫికేషన్ వెలువడడంతో సోమవారం ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జెడ్పీ సీఈఓ సుధాకర్ రెడ్డి ఆధ్వర్యంలో ఎంపీపీ ఎన్నిక నిర్వహించారు. మండలంలోని 9 మంది ఎంపీటీసీలు, కోఆప్షన్ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వెలిదండ్ల ఎంపీటీసీ ఎ.రమాదేవి పేరును ఎంపీపీ అభ్యర్థిగా ఇప్పట్ల ఎంపీటీసీ ఎం.అమృత ప్రతిపాదించారు. అందుకు బోనాల, లింగాల ఎంపీటీసీలు కళ్యాణి, జ్యోతి బలపరిచారు. దీంతో ఎంపీటీసీలు చేతులెత్తి రమాదేవిని ఏకగ్రీవ ఎంపీపీగా ఎన్నుకున్నారు. ఏకగ్రీవంగా ఎంపికై న ఎంపీపీ రమాదేవి మాట్లాడుతూ తనకు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డిల ఆశీస్సులతో ఈ పదవి వచ్చిందన్నారు. మండల అభివృద్ధి కోసం తన వంతు కృషి చేస్తానని ఇందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. తనను ఏకగ్రీవంగా ఎన్నుకున్న ఎంపీటీసీలకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఆమె తన భర్త అయిన మల్లికార్జున రెడ్డితో కలిసి ఎంపీటీసీలను సత్కరించారు. అదేవిధంగా డిప్యూటీ తహసీల్దార్ త్రిభువన్ రెడ్డి, ఎంపీడీఓ సురేంద్రనాథ్‌లు రమాదేవికి శుభాకాంక్షలు తెలిపారు. జెడ్పీటీసీ పుష్ప, లింగాల సింగిల్ విండో అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల యూత్ కన్వీనర్ మనోహర్ రెడ్డి, తాతిరెడ్డి పల్లె సర్పంచ్ మల్లికేశ్వర రెడ్డి, కర్ణపాపాయపల్లె నాగేశుల రెడ్డి, మండల వైఎస్సార్‌సీపీ నాయకుడు బాబురెడ్డి, మండలంలోని వివిధ గ్రామాల వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.


ఎంపీటీసీలతో ఎంపీపీ రమాదేవి

ఎస్ఎఫ్ఐ కన్వెన్షన్ విజయవంతం చేయాలి

వైవీయూ : తిరుపతి నగరంలోని శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో ఈనెల 9, 10 తేదీల్లో నిర్వహిస్తున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర విశ్వవిద్యాలయాల విద్యార్థుల కన్వెన్షన్‌ను విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర నాయకుడు ఎం.ఆర్.నాయక్ పిలుపునిచ్చారు. సోమవారం వైవీయూలో వారు కన్వెన్షన్‌కు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ విశ్వవిద్యాలయాల నుంచి ఎంపికై న విద్యార్థి ప్రతినిధులు ఈ కన్వెన్షన్‌కు హాజరవుతారని తెలిపారు. ఎన్ఈపీ అమలు, వివిధ విభాగాల్లో మిగులుసీట్లు, పీహెచ్‌డీ అభ్యర్థుల ఇబ్బందులు, ఉద్యోగ అవకాశాలు తదితర అంశాలపై చర్చించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గురులాల్, దేవ, సోని, విజయ్ పాల్గొన్నారు.


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ముగిసిన శిక్షణ తరగతులు

వీరపునాయునిపల్లె : జిల్లా నీటి యాజమాన్య సంస్థ వారి ఆర్థిక సహకారంతో ఆధునిక వ్యవసాయంపై గత ఆరు రోజులుగా జరుగుతున్న శిక్షణా తరగతులు సోమవారం ముగిశాయి. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఊటుకూరు వ్యవసాయ పరిశోధన స్థానం అధిపతి డాక్టర్ శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పంట సాగు చేసే ముందు భూసార పరీక్షలు తప్పని సరిగా చేయించాలని సూచించారు. వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త డాక్టర్ శ్రీవల్లి,డాక్టర్ సాయి మహేశ్వరి,డాక్టర్ ప్రశాంతి, నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు అధికారి కళ్యాణి, రైతులు పాల్గొన్నారు.

'గడప గడపకు మన ప్రభుత్వం'కు విశేష ఆదరణ



మాట్లాడుతున్న కమలాపురం ఎమ్మెల్యే పి. రవీంద్రనాథ్‌రెడ్డి


హాజరైన మండల ప్రజాప్రతినిధులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు

చింతకొమ్మదిన్నె : గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి కమలాపురం నియోజకవర్గంలో ప్రజల నుంచి విశేష ఆదరణ లభించిందని ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని విజయవంతం చేసిన మండల ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, సచివాలయ సిబ్బంది, మీడియా మిత్రులకు సోమవారం మండలంలోని మూలవంక సమీపంలో గల రాజా రాణి మహల్‌లో ఎమ్మెల్యే కృతజ్ఞత సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా స్థాయిలో కమలాపురం నియోజకవర్గంలో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష ఆదరణ లభించిందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించేందుకు ఈ కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడిందన్నారు. రాబోవు ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలందరూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తిరిగి ముఖ్యమంత్రిగా చూడాలని ఆకాంక్షిస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో అందిస్తున్న సంక్షేమ పథకాలను పొరుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు సైతం ఆదర్శంగా తీసుకొని వాటిని అమలు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు గుమ్మా రాజేంద్రనాథ్‌రెడ్డి, సోషల్ వెల్ఫేర్ కార్పొరేషన్ చైర్మన్ పులి సునీల్ కుమార్, ఏపీ పొల్యూషన్ బోర్డు డైరెక్టర్ పాకా సురేష్, ఈడిగ కార్పొరేషన్ డైరెక్టర్ కృష్ణయ్య, మండల కన్వీనర్ గూడ ప్రభాకర్ రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ గుత్తిరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, కో-కన్వీనర్ కళాయాదవ్, సర్పంచులు, ఎంపీటీసీలు, కార్పొరేటర్లు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.

సీఐగా బాధ్యతలు చేపట్టిన రామకృష్ణారెడ్డి



కమలాపురం : కమలాపురం సీఐగా బి.రామక్రిష్ణారెడ్డి బాధ్యతలు చేపట్టారు. అనంతపురం జిల్లా గుత్తి ఎస్ఐగా పని చేస్తున్న ఆయన పదోన్నతిపై కమలాపురం సీఐగా బదిలీపై వచ్చారు. సోమవారం సాయంత్రం బాధ్యతలు చేపట్టిన ఆయన మాట్లాడుతూ సర్కిల్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్లలో అందుబాటులో ఉంటూ అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపుతామన్నారు.

గృహ సారథులకు రూ.10 లక్షలు బీమా

పులివెందుల టౌన్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి గృహసారథులకు ప్రకటించిన రూ.10లక్షల బీమాకు సంబంధించిన వివరాలను సోమవారం స్థానిక చిన్నరంగాపురం సచివాలయంలో నమోదు చేసినట్లు కన్వీనర్ రామమూర్తిరెడ్డి తెలిపారు. జేసీఎస్ ఇన్‌చార్జి చంద్రమౌళి, వైఎస్సార్‌సీపీ నాయకులు మల్లికార్జున రెడ్డి, కొండయ్య, సంపత్ పాల్గొన్నారు.

నేడు ఆత్మీయ కృతజ్ఞత సభ

చెన్నూరు: చెన్నూరులోని గోసుల కళ్యాణ మండపంలో మంగళవారం ఉదయం 9 గంటలకు జరగనున్న ఆత్మీయ కృతజ్ఞత సభకు వైఎస్సార్‌సీపీ శ్రేణులు, జేసీఎస్ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు తరలి రావాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జీఎన్ భాస్కర్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మండల వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. కమలాపురం నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని దిగ్విజయంగా పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ సభ నిర్వహిస్తున్నామన్నారు. ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. జేసీఎస్ కన్వీనర్ శ్రీనివాసరాజు, ఎంపీపీ చీర్ల సురేష్ యాదవ్, నాయకులు ముదిరెడ్డి సుబ్బారెడ్డి, అల్లి శ్రీరామమూర్తి, పెడబల్లె ప్రదీప్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు ఎస్సీ కమిషన్ చైర్మన్ రాక

జమ్మలమడుగు : ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుముడి విక్టర్ ప్రసాద్ మంగళవారం సీఎస్ఐ క్యాంబెల్ ఆసుపత్రి ఆవరణంలో విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమానికి హాజరవుతున్నట్లు రాయలసీమ విద్యార్థి పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి పామిలేటి, ఎస్సీఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యుడు మేకల ఆంజనేయులు పేర్కొన్నారు. అంబేద్కర్ భావజాలం అనే అంశంపై ముఖాముఖి కార్యక్రమం ఉంటుందన్నారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

పులివెందుల రూరల్ : మున్సిపాలిటీ పరిధిలోని జెండామాను వీధిలో మలేరియా సబ్‌యూనిట్ అధికారి సిద్ధయ్య ఆధ్వర్యంలో ఫీవర్ సర్వే, లార్వా సర్వే నిర్వహించి వ్యాధులు ప్రబలకుండా ఇంటింటికి వెళ్లి అవగాహన కల్పించారు. దోమకాటుకు గురి కాకుండా జాగ్రత్తగా ఉండాలన్నారు.

హాస్టల్ విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : ప్రభుత్వ సంక్షేమ హాస్టల్ విద్యార్థుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆర్ఎస్ వైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కన్నెల్లూరు శంకర్ కోరారు.

నగరంలోని రాయలసీమ విద్యార్థి యువజన సంఘం రాష్ట్ర కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ హాస్టల్స్‌లలో చదువుకునే విద్యార్థిని, విద్యార్థులకు దుప్పట్లు, ప్లేట్లు, గ్లాసులు, ట్రంకు పెట్టెలు ఇవ్వాలన్నారు. రానున్న వర్ష కాలం, చలికాలం అలాగే దోమల బెడద కూడా ఎక్కువగా ఉంటుందన్నారు. విద్యార్థిని, విద్యార్థులు దోమ కాటుకు గురి అయితే డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్, విష జ్వరాలకు గురి అయ్యే ప్రమాదం ఉందన్నారు. కలెక్టర్, జిల్లా ఉన్నత అధికారులు వెంటనే స్పందించి విద్యార్థులకు దుప్పట్లు వారికి కావాల్సిన వస్తువులను వెంటనే పంపిణీ చేయాలన్నారు.

అంగవైకల్యానికి అడ్డుకట్ట వేద్దాం

కడప రూరల్ : సమష్టిగా ప్రాథమిక దశలోనే అంగవైకల్యం నిర్మూలనకు కృషి చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ నాగరాజు తెలిపారు. సోమవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో రాష్ట్రీయ బాల స్వస్థియ కార్యక్రమంపై ఆయన సమావేశం నిర్వహించి మాట్లాడారు. అంగవైకల్యానికి సంబంధించి చిన్న పిల్లల్లో నాలుగు రకాలైన లోపాలు గుర్తించడం, సకాలంలో చికిత్స అందించడం అనేది ముఖ్యమైన అంశమన్నారు. భవిష్యత్తులో అంగవైకల్యానికి గురి కాకుండా శారీరకంగా, మానసికంగా చూడటమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల్లో ఏదైనా అనారోగ్యం, అంగవైకల్యంను గుర్తించినట్లైతే అటువంటి పిల్లల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కడప రిమ్స్‌లోని జిల్లా బాల భవిత కేంద్రం, ప్రొద్దుటూరు జిల్లా ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన కేంద్రాలను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యులు వెంకటచంద్రారెడ్డి, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సంక్షేమం కోసమే ఎల్ఐసీ

కడప కల్చరల్ : ఎప్పటికీ జీవిత బీమా మార్కెట్లో ఎల్ఐసీ నెంబర్ వన్ గానే ఉంటుందని కడప సీనియర్ డివిజనల్ మేనేజర్ కె.గిరిధర్ అన్నారు. స్థానిక నాగరాజుపేట ఎల్ఐసీ బ్రాంచ్ కార్యాలయం నుంచి బీమా వారోత్సవాలలో భాగంగా ఎల్ఐసీ ర్యాలీని ప్రారంభిస్తూ ఆయన మాట్లాడారు. భారతదేశంలో ఎల్ఐసీ 72% వాటాతో మార్కెట్ లీడర్‌గా కొనసాగుతోందన్నారు. ఆరోగ్య పథకాలు, పెన్షన్ పథకాలు, సామూహిక పథకాల ద్వారా ఎల్ఐసీ భారతీయ పాలసీదారుల సంక్షేమానికి కట్టుబడి ఉందన్నారు. దీనితోపాటు, హౌసింగ్, ఇరిగేషన్, రైల్వే, రోడ్లు తదితర రంగాల్లో ప్రభుత్వ పథకాలకు ఫైనాన్స్ చేయడం ద్వారా దేశ అభివృద్ధికి ఎల్ఐసీ గత 67 సంవత్సరాలుగా కట్టుబడి పనిచేస్తోందన్నారు. కడప డివిజన్ పలు ఎల్ఐసీ పాలసీల సేకరణలో మంచి ఫలితాలు సాధిస్తోందన్నారు. ఎల్ఐసీ ర్యాలీ కడప నాగరాజుపేట బ్రాంచ్ కార్యాలయం నుంచి ప్రారంభమై మహిళా కళాశాల, పాత బస్టాండు, ఏడు రోడ్లు, క్రిస్టియన్ లైన్, ఎన్టీఆర్ సర్కిల్ మీదుగా కడప బ్రాంచ్ కార్యాలయం వరకు సాగింది. మహిళలు, ఏజెంట్లు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ర్యాలీలో మార్కెటింగ్ మేనేజర్ శ్యాంసుందర్రావు, మేనేజర్ సేల్స్ శ్రీనివాస్, ఎల్ఐసీ బ్రాంచ్ మేనేజర్లు సంజీవ ప్రసాద్, వెంకటకృష్ణ, సంఘాల ప్రతినిధులు నిత్యానందరెడ్డి, ఎల్లారెడ్డి, సంజయ్, రఘునాథరెడ్డి, సుధీకర్ తదితరులు పాల్గొన్నారు


నగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఎల్ఐసీ ఉద్యోగులు